నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
శుక్రవారం
28 నవంబర్
2025


# పంచాయతీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

**పోలీసు కమీషనర్ గౌష్ ఆలం**



**కరీంనగర్, నవంబర్ 27 (నినాదం) :** కరీంనగర్ జిల్లాలో మూడు దశల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా, మొదటి విడత ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, నిస్పక్షపాతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కరీంనగర్ పోలీసు కమీషనర్ గౌష్ ఆలం తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద బందోబస్తు మొదటి విడతలో చొప్పదండి, రామడుగు, గంగాధర, కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ (05) మండలాల్లో నామినేషన్ల స్వీకరణ జరుగుతోంది. దీనికోసం జిల్లావ్యాప్తంగా 33 నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, వాటి వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ పేర్కొన్నారు. సీపీ గౌష్ ఆలం ఈ కేంద్రాల్లో పలు చోట్ల భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు.

**సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల సందర్శన**

అంతేకాకుండా, పలు గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను స్థానిక పోలీసు అధికారులతో కలిసి సీపీ గురువారం నాడు సందర్శించారు. ఎన్నికలు సజావుగా సాగేలా ఈ కేంద్రాల వద్ద పోలింగ్ రోజు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

**ఎన్నికల నియమావళి అమలు, బైండోవర్ చర్యలు**

ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినందున శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు చేపడుతున్నట్లు సీపీ తెలిపారు. ఇందులో భాగంగా, గతంలో నేర చరిత్ర ఉన్న ఎన్నికల నేరస్థులను బైండోవర్ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో, నిస్పక్షపాతంగా ఎన్నికలు సజావుగా సాగేందుకు అవసరమైన అన్నీ చర్యలు చేపడతామని, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం విజ్ఞప్తి చేసారు.

ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయకుమార్, చొప్పదండి సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్, ఎస్సైలు రామడుగు (రాజు ), గంగాధర (వంశీకృష్ణ), చొప్పదండి (నరేష్ రెడ్డి ) తో ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆ గ్రామంలో ఎస్సీలకు రిజర్వేషన్ లేదు

**"రాజకీయ కుట్రనా? అధికారుల నిర్లక్ష్యమా?**

**కౌకుంట్ల గ్రామంలో దళితులు రాజకీయంగా ఎదగాకుండా వెనకబాటు.**

**ఎస్సీ ఓటర్లు 595 ఉండగా ఒక్క వార్డు కూడా రిజర్వు కానీ వైనం.**

**హైకోర్టును ఆశ్రయించిన "కౌకుంట్ల" దళితులు.**



**చేవెళ్ల నవంబర్ 27 (నినాదం):** ఆ గ్రామంలో ఇప్పటివరకు ఎస్సీలకు రిజర్వేషన్ లేదు! రాజకీయ కుట్రనో? అధికారుల నిర్లక్ష్యమో? ఏమో కానీ రాజకీయంగా ఎదగకుండా కుట్ర జరుగుతుందని రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల పరిధిలోని కౌకుంట్ల గ్రామంలోని దళితులు హైకోర్టును ఆశ్రయించారు. 595 మంది ఎస్సీలు ఉన్న గ్రామపంచాయతీలో ఒక్క వార్డు ఎస్సీ రిజర్వుడు కాలేదని, ఎస్సీలను రాజకీయంగా ఎదురు ఇవ్వకుండా కుట్ర జరుగుతుందని గ్రామ మాజీ వార్డ్ మెంబర్ తలారి మహేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎలక్షన్ గెజిట్ విడుదల చేసింది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల పరిధిలోని కౌకుంట్ల గ్రామంలో మొత్తం జనాభా 2060 ఉండగా అందులో ఎస్సీలు 595 మంది ఉండగా, 300 మంది మహిళలు 295 మంది పురుషులు ఉన్నారు. గ్రామంలో 10 వార్డుల్లో 5 జనరల్ స్థానాలు 5 బిసి స్థానాలుగా కేటాయించారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం గ్రామపంచాయతీ విడుదల చేసిన ప్రకటనలో స్పష్టంగా, ఎస్సీలు 595 మంది,ఉండగా 300 మంది మహిళలు 295 మంది పురుషులు ఉన్నట్లుగా స్పష్టంగా ప్రకటన తెలపగా, అందులో ఎస్సీలకు ఒక్క వార్డు కూడా రిజర్వుడు చేయకపోవడం దారుణమని గ్రామంలోని దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. గత గ్రామపంచాయతీ ఎన్నికల్లో కూడా, ఎస్సీ వార్డు రిజర్వు కాకుండా తమకు అన్యాయం జరిగిందని, ప్రస్తుత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూడా మాకు న్యాయం జరుగుతుందని ఎంతో ఆశగా ఎదురు చూస్తామని, గ్రామంలోని దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## దుండిగల్ డబుల్ బెడ్ రూమ్ నివాసితులకు నీటి కష్టాలు తీర్చుటకు చర్యలు

**హామీ ఇచ్చిన కొలను హనుమంత రెడ్డి**



**కుత్బుల్లాపూర్, నవంబర్ 27 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ దుండిగల్ డబల్ బెడ్ రూమ్స్ లబ్దదారులు సరిపడా నీటి సరఫరా కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయమును కొలను హనుమంత రెడ్డి దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి జలమండలి అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులు సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరగా సమస్య ని పూర్తిచేస్తామని హామీ ఇచ్చినట్లు కోలన్న హనుమంత రెడ్డి స్థానికులకు భరోసా ఇచ్చారు. త్వరలోనే డబుల్ బెడ్రూం ఇల్లు లబ్ధిదారులకు నీటి కొరత లేకుండా సమస్య పరిష్కరించబడుతుందని అందుకు కావలసిన కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి,మాజీ సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు కావలి గణేష్, మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముత్యం రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# సర్ఫేస్ ఉద్యోగంలోకి మారడానికి 5 లక్షలు ఇచ్చి మోసపోయా..?


**ప్రెస్ మీట్లో భరత్‌కుమార్ ఆవేదన**

**డ్యూటీలో చేరడానికి ఇచ్చిన డబ్బు వెనక్కి ఇవ్వాలి : ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ నాయకురాలు జనగామ స్వప్న**





**గోదావరిఖని నవంబరు 27 ( నినాదం):** సర్ఫేస్ జాబ్ కోసం ఉడుత నాగరాజు అనే దళారీని నమ్మి దాదాపు 5 లక్షల రూపాయల మేర నష్టపోయాననీ బాధితుడు నీరుడు భరత్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జనగామ స్వప్నతో కలిసి సర్ఫేస్ జాబ్ విషయంలో తనకు జరిగిన అన్యాయాన్ని భరత్ కుమార్ వివరించారు. తాను 2022లో సింగరేణి జాబ్ కు అపాయింట్ అయ్యాయని, గోదావరిఖని టూ ఏ ఇంక్లైన్ లో అండర్ గ్రౌండ్ లో వర్క్ చేస్తున్న తనకు బయట యాక్సిడెంట్ జరగడంతో.. తనకు సర్ఫేస్ జాబ్ కావాలని ఉడుత నాగరాజు అనే వ్యక్తిని ఆగస్ట్ 13, 2024 లో సంప్రదించానన్నాడు. అందుకు అతను కొంత డబ్బును అడగగా అందులో లక్షా యాభై వేలు తనకు తెలిసిన వ్యక్తి ఫోన్ నుండి ఆన్ లైన్ ద్వారా, మరికొంత డబ్బును నగదు రూపంలో ఇవ్వడం జరిగిందని వెల్లడించాడు. కానీ ఇప్పటికీ సంవత్సరం గడిచినా కూడా తనకు సర్ఫేస్ జాబ్ ఇప్పించకపోవడంతో సదరు వ్యక్తిని నిలదీయగా తన డబ్బులు తనకు ఇస్తానని డ్యూటీలో చేరాలని సమాధానం ఇస్తున్నారని తెలిపారు. తాను ఫిట్ ఫర్ జాబ్ అని తీసుకొని డ్యూటీలో చేరితే మళ్ళీ అండర్ గ్రౌండ్ జాబ్ వస్తుందని, ఇంతకాలం తాను జాబ్ చేయకుండా దీపావళి బోనస్, దసరా అడ్వాన్స్, జీతం రూపంలో 5 లక్షల రూపాయల వరకు నష్టపోవడం జరిగిందన్నాడు. ఈ విషయమై తాను పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ చేయగా, కంప్లైంట్ తేదీ కన్నా ముందే డబ్బులు ఫోన్ ద్వారా ఆన్ లైన్లో పంపిన వ్యక్తికి తిరిగి చెల్లించినట్లుగా తప్పుడు పత్రాలు సృష్టించారని ఆరోపించాడు. జనగామ స్వప్న మాట్లాడుతూ ఐ.ఎన్.టి.సి. నాయకుడు ధర్మపురి అనుచరుడిగా ఉన్న ఉడుత నాగరాజు నిర్వాకం మూలంగా భరత్ కుమార్ అన్ని విధాలుగా నష్టపోవడం జరిగిందని ఆరోపించారు. ఆన్లైన్ రూపంలో లక్షా యాభై వేల రూపాయలకు మాత్రమే ఆధారాలు ఉన్నాయని, ఇంకా దాదాపు 5 లక్షల రూపాయల మేర ధర్మపురి వెనకాల ఉండి ఉడుత నాగరాజు ద్వారా భరత్ కుమార్ నుండి తీసుకోవడం జరిగిందని వెల్లడించారు. భరత్ కుమార్ కు న్యాయం చేయాలని కోరారు. ఇంకా ఈ విలేకరుల సమావేశంలో భరత్ కుమార్ తల్లి శశిరేఖ ఉన్నారు.

# చెన్గోముల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్



**వికారాబాద్, నవంబర్ (నినాదం ):** జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్ వికారాబాద్ జిల్లా చెన్గోముల్ పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా సందర్శించారు.ఈ పర్యటనలో భాగంగా, ఎస్పీ ముందుగా పోలీస్ స్టేషన్ ఆవరణను, సిబ్బంది విధుల నిర్వహణను, రికార్డుల నిర్వహణను, పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్, లాకప్ గదుల వంటి వివిధ విభాగాలను పరిశీలించారు. స్టేషన్ చరిత్ర, పరిధికి సంబంధించిన వివరాలను, గతంలో నేటివరకు నమోదైన మొత్తం కేసుల సంఖ్యను, ప్రస్తుతం విచారణలో ఉన్న, పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతి గురించి స్టేషన్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ గారు మాట్లాడుతూ పోలీస్ అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, వారితో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. ఫిర్యాదుదారులతో సానుభూతితో వ్యవహరించి, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కేసుల విచారణలో నాణ్యత, న్యాయబద్ధత పాటించి, నిందితులకు శిక్ష పడే విధంగా చూడాలని ఆదేశించారు. ముఖ్యంగా పోక్సో ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు, మహిళలు, బాలికలకు సంబంధించిన కేసులు, ఇతర గ్రేవ్ కేసులలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వాటిని వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు. ఆస్తి సంబంధిత నేరాలైన దొంగతనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. రాబోయే సర్పంచ్ ఎన్నికల దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికలకు సంబంధించిన ముందస్తు సమాచారం సేకరించి పెట్టుకోవాలని తెలిపారు. సిబ్బంది తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, విధుల్లో క్రమశిక్షణతో పాటు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చెన్గోముల్ ఎస్.ఐ. భరత్ కుమార్ రెడ్డి మరియు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లను పరిశీలించిన లోకల్ బాడీస్ అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్



**మల్లాపూర్, నవంబర్ 27 (నినాదం) :** స్థానిక సంస్థల ఎన్నికల నగరా బుధవారం మోగింది అందులో భాగంగా మల్లాపూర్ మండలం లోని మల్లాపూర్, కొత్త దాంరాజ్ పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ స్వీకరణ కేంద్రంల ఏర్పాట్లను అడిషనల్ లోకల్ బాడీస్ అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్ పరిశీలించారు. కొత్త ధాంరాజ్ పల్లి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి, నాణ్యమైన భోజనం పెడుతున్నారో లేదో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎన్నికల రిటర్నింగ్, సహాయ అధికారి స్వీకరణ గదులను, తదితర అంశాలను సైతం పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పారదర్శకంగా సజావుగా జరగాలని, నామినేషన్ల స్వీకరణకు సంబంధించి తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, పాటించాల్సిన విధానాల గురించి ఆరా తీశారు. ఏలాంటి పొరపాట్లు, ఆలస్యం లేకుండా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పక్కగా జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీకాంత్, ఎమ్మార్వో రమేష్ గౌడ్, ఎంపీఓ జగదీష్ తదితరులు అధికారులు పాల్గొన్నారు.

# దామరచేడ్ పంచాయతీలో నామినేషన్ దాఖలు

**హాజరైన పైలెట్ రోహిత్ రెడ్డి**



**వికారాబాద్, నవంబర్ 27 (నినాదం):** పంచాయతీ మొదటి విడత ఎన్నికల నామినేషన్ల పర్వం గురువారం ప్రారంభమైంది. సందర్భంగా ఆయా మండలాల్లో పలువురు సర్పంచ్ అభ్యర్థులు మద్దతు దారులతో కలిసి నామినేషన్లు వేశారు. బషీరాబాద్ మండలం దామరచేడ్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి సతీమణి భారతి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి పైలెట్ రోహిత్ రెడ్డి కూడా హాజరై ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా భారతి శ్రీనివాస్ రెడ్డి, దామరచేడ్ గ్రామ బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ పైలెట్ రోహిత్ రెడ్డి సహకారంతో గతంలో గ్రామంలో అనేక సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దగ్గర పడుతున్న ఇంకా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. తనకు అవకాశం ఇస్తే గ్రామంలో నెలకొన్న సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మీడియా ప్రతినిధి పంజుగుల శ్రీశైల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నర్సిరెడ్డి తదితరులు ఉన్నారు.

# బిఆర్ఎస్‌లో చేరిన నాయకులు



**వికారాబాద్, నవంబర్ 27(నినాదం):** జిల్లా పరిధిలోని గండిడ్ మండలం దేశాయిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు 20 మంది పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి సమక్షంలో గురువారం బి ఆర్ ఎస్ లో చేరారు. వారిని పార్టీ కండువా వేసి సాధారంగా ఆహ్వానించారు. స్థానిక ఎన్నికల వేళా అధికార పార్టీ నుండి బి ఆర్ ఎస్ లో చేరటం మండలంలో చర్చనీయాంశాంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేయనున్నట్లు పార్టీలో చేరిన వారు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## రాష్ట్రస్థాయి ఖోఖో జట్టుకు ఎంపికైన సారంగాపూర్ విద్యార్థిని



**సారంగాపూర్:** సారంగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న చేకుట మైత్రి రాష్ట్ర స్థాయి జూనియర్ ఖో ఖో జట్టుకు ఎంపికైనట్టుగా పాఠశాల ఫిజికల్ డైరెక్ట ర్ డాక్టర్ రవీందర్ తెలిపారు. ఈనెల 28 నుండి 30 తేది వరకు మూడు రోజుల పాటు పటాన్ చెరు లో జరిగే టోర్న మెంట్ లో మైత్రి పాల్గొననుంది. మైత్రి ఎంపికపట్ల పాఠ శాల ప్రధానోపాధ్యాయులైన మండలవిద్యాధికారి కిషోర్, ఉ పాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

# సమాజంలో జర్నలిస్టులకు ప్రత్యేక గుర్తింపు

**విధులతో పాటు హక్కుల కోసం పోరాడాలి**

**నిర్మల్ ప్రెస్ క్లబ్‌లో జాతీయ పత్రికా దినోత్సవం లో విశ్రాంత జర్నలిస్టులు**



**నిర్మల్ ప్రతినిధి, నవంబర్ 27:(నినాదం):** సమాజంలో జర్నలిస్టులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని,దానిని కాపాడుకుంటూ.. విధులను నిర్వర్తించాలని విశ్రాంత జర్నలిస్టులు కట్టా నాగచారి, మహురం గంగాధర్,పత్తి శివప్రసాద్, సీహెచ్.ఎల్.ఎన్.చారి,విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎమ్.సి.లింగన్న లు అన్నారు. గురువారం నిర్మల్ క్లబ్ లో జాతీయ పత్రిక దినోత్సవాన్ని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రాసం శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించారు.ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సీనియర్ పాత్రికేయుడు పురస్తు సురేందర్ కుమారుడు సాయి చరణ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో.. రెండు నిమిషాలు మౌనం పాటించారు. అలాగే ఇటీవల రిపోర్టర్లు నరేందర్ వాళ్ళ నాన్న గారు, వసీవుల్లా వాళ్ల అమ్మగారు మరణించడంతో వారికి కూడా సభ్యులందరూ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విశ్రాంత జర్నలిస్టులు మాట్లాడుతూ ..విలేకరులు విధులతో పాటు హక్కల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రోజు రోజుకు పత్రికా రంగంలో వినూత్న మార్పులు వస్తున్నాయని, వాటికి అనుగుణంగా పాత్రికేయులు తమ వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. రాబోవు రోజుల్లో పత్రిక రంగం ప్రమాదంలో పడుతుందని, ఎలక్ట్రానిక్ మీడియా,సోషల్ మీడియా ఆధిపత్యం పెరిగిపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వాలు స్పందించి పాత్రికేయులకు జీవన భృతి, ఇళ్ల స్థలాలు, వారి పిల్లలకు విద్యా రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా శాలువా తో సన్మానించి, మెమంటోలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రాసం శ్రీధర్, ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీనారాయణ,ప్రింట్, ఉర్దూ, ఎలక్ట్రానిక్ వివిధ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు.

# పైనంపల్లి వద్ద తనిఖీలను పరిశీలిస్తున్న అధికారి యర్రయ్య..

**ప్రతీ వాహనం ను క్షుణ్ణంగా తనీఖీ చేయాలి**




**పాలేరు నవంబర్. 27.( నినాదం) :**

జిల్లా సరిహద్దు వద్ద చెకోపోస్టులో తనీఖీలు ప్రతీ వాహనం ను క్షుణ్ణంగా తనీఖీ చేయాలని నేలకొండపల్లి ఎంపీడీఓ, మండల కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారి యం.యర్రయ్య సూచించారు.జిల్లా సరిహద్దు గ్రామమైన పైనంపల్లి వద్ద ఏర్పాటు చేసిన చెకోపోస్టు ను గురువారం ఆకసిక్మంగా తనీఖీ చేశారు.సిబ్బంది కి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మద్యం.డబ్బు.ఇతరత్రా వస్తువులు అక్రమంగా రవాణా చేయకుండా చూడాలని ఆదేశించారు ఎంతటి వారి వాహనం అయినా సరే తనీఖీ చేయాల్సిందేన్నారు.విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.అన్ని శాఖల అధికారులు,సమన్వయంతో పని చేయాలని సూచించారు.ఎన్నికల నియమావళిని బచ్చితంగా అమలు చేయాలని సూచించారు.ఎన్నికల కోడ్,ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయని,హెచ్చరించారుఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికల ప్రక్రియ షురూ..

**పోటీకి వీళ్లు కూడా అర్హులే**

**కోదాడ( నినాదం):** రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ మేరకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. పల్లెల్లో ఎన్నికల హడావుడి పెరిగింది.జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం ఓటర్లు 6,94,815 ఉండగా అందులో 3,40,743 పురుషులు, 3,54,050 మంది మహిళలు, 22 ఇతరులు ఉన్నారు. జనాభా ఆధారంగా రెండు గ్రామ పంచాయతీలకు కలిపి ఒక రిటర్నింగ్ అధికారిని నియమించారు.కోదాడ నియోజక వర్గం లోని మండలాలలో రెండవ విడత ఎన్నికలు జరగనున్నాయి.ఈనెల 30వ తారీకు నుండి డిసెంబర్ 2వ తారీకు అభ్యర్థులు నామినేషన్ వేయవచ్చు.ఇందుకు అవసరమైన ఏర్పాట్లను ఎన్నికల సంఘం, జిల్లా అధికారులు పూర్తి చేశారు.రెండవ విడతలో అనంతగిరి, చిలుకూరు, , కోదాడ, మోతె, మునగాల, నడిగూడెం, మండలాల్లోని ఎన్నికలు నిర్వహిస్తారు.ఎన్నికల వ్యయం పై నిఘా పెట్టేందుకు ప్రత్యేక బృందాలను నియమించారు. పార్టీలకు అతీతంగా జరిగే ఎన్నికలైనప్పటికీ అన్ని పార్టీల నాయకులు సర్పంచ్, వార్డుల్లో తమ పార్టీ అభ్యర్థులు గెలిచే విధంగా వ్యూహాలు రచించడంలో నిమగ్నమయ్యారు. పూర్తిగా పట్టున్న చోట ఏకగ్రీవానికి సైతంపావులు కదుపుతున్నారు. అర్ధ బలం, అంగబలం, సామాజికంగా పట్టున్న గెలుపు గుర్రాలను ఎంపిక చేసేందుకు పార్టీల నాయకులు ప్రాధాన్యతనిస్తున్నారు. పోటీలో నిలిచే అభ్యర్థులు అన్ని రకాల హంగులు సమకూర్చుకుని పల్లె పంచాయతీకి సిద్ధమవుతున్నారు.



1) కుల ధృవీకరణ పత్రము జిరాక్స్
2) ఓటరు గుర్తింపు కార్డు (పోటీ చేసే అభ్యర్థి) జిరాక్స్ కాపి
3) ఓటర్ గుర్తింపు కార్డు (ప్రతిపాదించే అభ్యర్థి) జిరాక్స్ కాపి
4) ఇంటి పన్ను రశీదు జిరాక్స్ కాపి
5) పాస్ పోర్ట్ సైజు ఫోటోలు (4)
6) నూతన బ్యాంక్ ఖాతా జిరాక్స్

నామినేషన్ డిపాజిట్ వివరములు

| పదవి పేరు | జనరల్ అభ్యర్థులకు | యస్.సి/యస్.టి / బిసి అభ్యర్థులకు |
|---|---|---|
| సర్పంచ్ | 2000.00 | 1000.00 |
| వార్డు మెంబర్ | 1000.00 | 500.00 |

పోటీ చేయు అభ్యర్థులు చేయుదగిన ఎన్నికల వ్యయ గరిష్ట పరిమితి

| పదవి పేరు | ఎన్నికల వ్యయ గరిష్ట పరిమితి |
|---|---|
| సర్పంచ్ | 1,50,000.00 |
| వార్డు మెంబర్ | 30,000.00 |

సహాయ ఎన్నికల అధికారి

**రూ.2 వేలు డిపాజిట్...**

21 ఏండ్ల వయస్సు ఉన్న వారు, అదే గ్రామంలో ఓటరుగా నమోదైన వారు%% సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసేందుకు అర్హులు. సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేసేవారు (జనరల్) రూ.2వేలు డిపాటిట్ చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీలు రూ.వెయ్యి డిపాజిట్ కింద చెల్లించాలి. వార్డు సభ్యులుగా పోటీ చేసే వారు (జనరల్) రూ.500, ఎస్సీ, ఎస్టీ, బీసీలు రూ.250 డిపాజిట్ చెల్లించాలి.

**ఎన్నికల వ్యయ పరిమితి...**

ఐదు వేల జనాభాకు పైగా ఉన్న గ్రామాలలో సర్పంచ్ అభ్యర్థి 2 లక్షల 50 వేల రూపాయల వరకు, వార్డు సభ్యులకు 50 వేల రూపాయలు, 5 వేల జనాభా తక్కువగా ఉన్న గ్రామాలలో ఒక లక్ష 50 వేల రూపాయలు, వార్డు సభ్యులు 30 వేల వరకు ఖర్చు చేసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

**పోటీకి వీరూ అర్హులే...**

ఇద్దరి కన్నా ఎక్కువ మంది పిల్లలున్న వారు సైతం ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హులు. డిసెంబర్3న బరిలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను డిసెంబర్ 6న ప్రకటిస్తారు. డిసెంబర్14న రెండవ విడత పోలింగ్ జరగనుంది. అదే రోజు ఓట్లను లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు. ఉప సర్పంచ్ ఎన్నిక కూడా నిర్వహిస్తారు.

